క్లుప్తంగా

బాక్సర్ దానయ్యకు ఆర్థిక సాయం



బాక్సర్ దానయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోటకు చెందిన వాసుపల్లి దానయ్య అలియాస్ బాక్సర్ దానయ్య గత కొన్ని రోజుల క్రితం రైలు ప్రమాదానికి గురయ్యాడు. అతను నగరంలో ఒక హాస్పిటల్లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ బుధవారం ఆయనను పరామర్శించారు. డాక్టర్లతో ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి అతనికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సొంత నిధుల నుంచి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఓటర్ల ప్రతిజ్ఞ



ఓటర్లచే ప్రతిజ్ఞ చేయిస్తున్న గ్రంథాలయ అధికారి

డాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పీవీ నూకరాజు పాఠకులు, సిబ్బందిచే ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో..



ఓటర్ల దినోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ శోభారాణి తదితరులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ వారి పేరిట ఓటు నమోదు చేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఏజీవో డాక్టర్ కె. సుధ, రాజనీతిశాస్త్ర అధ్యాపకులు జి. జ్యోతి, బి. నాగమణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామింగ్ అధికారులు ఎన్వీ పద్మకుమారి, ఎస్. అనురాధ, ఐక్యూఏజీ కో ఆర్డినేటర్ అరుణపద్మ తదితరులు పాల్గొన్నారు.

అందరి నోట.. శ్రీహరి పాట



ఆంజనేయస్వామి గుడిలో ఆధ్యాత్మికత పంచుతూ..

- శ్రీ తుంబుర హరిహర నామ సంకీర్తన మిత్రమండలి ఆశయం అదే
- సంగీతంతో ఉచిత సేవలందిస్తున్న భజన బృందం సభ్యులు

డాబాగార్డెన్స్: ఒకరు పోలీస్ డిపార్టుమెంట్‌లో పనిచేసి ఇటీవలే పదవీ విరమణ పొందారు. మరొకరు జీవీఎంసీలో పని చేస్తున్నారు. ఇంకొకరు వేరే విభాగంలో సేవలందిస్తున్నారు. వేరొకరు సేవే లక్ష్యంగా ఉన్నారు. ఇలా ఐదారుగురు కలిసి ఓ బృందంగా ఏర్పడ్డారు. దైవకార్యక్రమాలకు.. పేద వారు ఎవరైనా చనిపోతే.. తప్పనిసరిగా భజన పెట్టాలన్న నియమం ఉంటే అటువంటి వారికి.. వీటితో పాటు మరీ ముఖ్యంగా హరిహర నామ సంకీర్తన అందరి నోట.. గ్రామ గ్రామాన వినిపించాలన్న ఉద్దేశంతో శ్రీ తుంబుర హరిహర నామ సంకీర్తన మిత్రమండలిగా ఏర్పడ్డారు. ఈ మిత్రమండలి దైవ కార్యక్రమాలు.. హరిహర నామ సంకీర్తన కోసం ఉచితంగా భజన కార్యక్రమాలు చేపట్టేందుకు ఇటీవలే శ్రీకారం చుట్టింది.

వివరాల్లోకి వెళ్తే..ఈ నెల 2న ముక్కోటి ఏకాదశి రోజున శ్రీతుంబుర హరిహర నామ సంకీర్తన మిత్ర మండలి (అప్పారావు, రమణ, తులసి, హనుమంతరావు, డప్పు రమణ.. తదితరులతో) ఏర్పాటైంది. ప్రారంభం రోజునే పలు రామాలయాలు.. ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు పలు దైవ కార్యక్రమాలకు ఉచితంగా బైతో భజన కార్యక్రమం నిర్వహించారు. అప్పటి నుంచి బృందం సభ్యులు నిత్యం ఏదో చోట ఉచితంగానే భజన కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పలు భజన కార్యక్రమాలు ఉచితంగా నిర్వహించారు.

బైతో భజనను రక్షించుకుందామనే..

మూడు..నాలుగు దశాబ్దాల కిందటి వరకు బైతో భజనకు మంచి గిరాకీ ఉండేది. పరసలు.. ఉత్సవాలు.. దేవాలయాలు.. ఇలా ఆధ్యాత్మిక కార్యక్రమాల కోసం భజన కార్యక్రమాలు విరివిగా నిర్వహించేవారు. శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భజన కార్యక్రమాలు కనుమరుగవుతున్నాయి. డోలక్.. హార్మోనియం.. తాళాలు.. ఇటువంటి వాటికి ప్రత్యామ్నాయంగా ఎన్నెన్నో



ఓ రామాలయంలో మిత్ర మండలి బృందం భజన కార్యక్రమం

మ్యూజిక్ పరికరాలు వచ్చేయడంతో నానాటికి అవి కనుమరుగవుతున్నాయని నిర్వాహకులు అప్పారావు, చిన రమణ సాక్షికి తెలిపారు. బైతో భజన అంటే.. కూర్చుని తాళాలు వేయాలి. కనీసం నాలుగైదు గంటలైనా తాళాలు వేస్తూ.. హార్మోనియం మోగిస్తూ.. డోలక్ వాయిస్తుంటే.. ఆ థ్రిల్లే వేరంటున్నారు నిర్వాహకులు. అటువంటి కళ నానాటికీ మరుగున పడుతుండడాన్ని తాము జీర్ణించుకోలేకపోతున్నామని, అంతేగాక ఆ కళాకారులు కూడా రోడ్డున పడుతున్న దృష్ట్యా బైతో భజనను ఎలాగైన బతికించాలన్న ఉద్దేశంతో మిత్రమండలి ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

హరిహర నామ సంకీర్తన అందరినోట..

ముఖ్యంగా హరిహర నామ సంకీర్తన అందరి నోట వీధి వీధినా..గ్రామ గ్రామాన వినిపించాలన్న లక్ష్యంతో



ఇంట్లో హరిహర నామ సంకీర్తనలు ప్రాక్టీస్ చేస్తూ..

ప్రతి రామాలయం, సాయిబాబా, అమ్మవారి పరస మహోత్సవాలు.. శివాలయాలు.. ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఉచితంగా మూడు గంటల పాటు ఈ భజన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటితో పాటు నిరుపేదలు ఎవరైనా చనిపోతే.. వారికి తప్పనిసరిగా భజన ఉండాలనే నియమం ఉంటే అందుకు మిత్రమండలి ఉచితంగా భజన కార్యక్రమం నిర్వహించనుంది.

ఎవర్ని సంప్రదించాలి..

రామాలయాలు.. శివాలయాలు.. పర్వదినాలు.. ఉత్సవాలు.. పరస మహోత్సవాలు.. జాతర సంబరాల్లో బైతో భజన కార్యక్రమం నిర్వహించాలనుకునే వారు 9949555069 నంబరులో సంప్రదించవచ్చు. వీరు వచ్చి 2 నుంచి 3 గంటల పాటు భజన కార్యక్రమం ఉచితంగా నిర్వహించి వెళ్తారు.

జీ-20 సదస్సు నేపథ్యంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం



పోలీస్ బ్యారెక్స్ వద్ద రహదారులను పరిశుభ్రం చేయిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: జీ-20 సదస్సు నేపథ్యంలో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు జీవీఎంసీ జోన్-4 కమిషనర్ కె. శివప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన జోన్ పరిధిలో జగదాంబ, బీచ్‌రోడ్డు, కాంప్లెక్స్ ఫ్లైఓవర్, కన్వెంట్ జంక్షన్, రైల్వే స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారుల్లో పర్యటించి వార్డు ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. జీ-20 నేపథ్యంలో పలు దేశాల నుంచి వస్తున్న అతిథులకు నగరాన్ని అందంగా చూపించాలన్నారు. రోడ్డుపైన చెత్తపోగులు లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలన్నారు. కాల్వల్లో మురుగు లేకుండా చూడాలన్నారు. రాత్రి వేళ్లలో నిర్వహిస్తున్న శానిటేషన్ పట్ల కూడా శ్రద్ధ వహించాలన్నారు. శానిటరీ సెక్రటరీలు విధిగా సమయానికి విధులకు హాజరై సిబ్బందితో పనులు చేయించాలన్నారు. సిబ్బంది సమయానుసారంగా అందుబాటులో ఉండాలని జెడ్సీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోబడ్డి యాప్ క్యాలెండర్ ఆవిష్కరణ



గోబడ్డి యాప్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి తదితరులు

డాబాగార్డెన్స్: మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చేతుల మీదుగా బుధవారం జీవీఎంసీ మేయర్ చాంబర్‌లో గోబడ్డి యాప్‌కు సంబంధించి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ రమణమూర్తి, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రితో కలిసి మేయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. విశాఖలో హోమ్ సర్వీసెస్‌కు సంబంధించి నేరుగా ఇంటి వద్దకే వచ్చి సర్వీసులు అందించడానికి ఈ యాప్ విశాఖలో తొలిసారిగా ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా పలువురికి ఉపాధి అవకాశాలు కూడా కల్పించబడతాయని, కార్పెంటర్లు, ప్లంబర్లు, ఏసీ మెకానిక్, హౌస్‌కీపింగ్, టాక్సీ డ్రైవర్లు వంటి వారికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని మేయర్ తెలిపారు. నగర పౌరుడు ఈ యాప్‌ను ఉచితంగా ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని సేవలు పొందవచ్చని తెలిపారు. ల్యాబ్ టెస్టులు, వైద్య సదుపాయాలు, డాక్టర్ అపాయింట్‌మెంట్ కూడా ఈ యాప్ ద్వారా ఇంటి వద్దనే బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోబడ్డి యాప్ ప్రతినిధులు రాజుగౌడ్, శివకుమార్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షా శిబిరంలో పాల్గొన్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

సీతమ్మధార : ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం పౌరులుగా ప్రతి ఒక్కరి బాధ్యత అని వైఎస్సార్‌టీయూసీ నాయకుడు వై.మస్తానప్ప అన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షలో వైఎస్సార్ టీయూసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మస్తానప్ప మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.దాలినాయుడు, రమణ జి.అప్పలరెడ్డి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వస్వం.. సంక్షేమం

- సీఎం పాలన పట్ల మహిళల్లో ఆనందం
- 'గడపగడపకు..' కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి



లబ్ధిదారులకు జగనన్న సంక్షేమం బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: గత ప్రభుత్వాలకు భిన్నంగా.. సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకెళుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. 31వ వార్డు భీమ్‌నగర్ సచివాలయం పరిధి ఆర్ఆర్ గ్రాండ్ హోటల్ వీధి, ప్రేమసమాజం, కృష్ణాగార్డెన్స్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ బిపిన్‌కుమార్‌జైన్‌తో కలిసి ఎమ్మెల్యే బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రేమసమాజంలో కొంతమంది లబ్ధిదారులకు జగనన్న సంక్షేమ బుక్‌లెట్లు అందజేశారు. మొత్తం 85 మంది నిరాశ్రయులుండగా, వారిలో 25 మందికే పెన్షన్లు వస్తున్నాయి. దీనికి కారణం తెలుసుకున్న ఎమ్మెల్యే మిగిలిన 60 మందికి ఆధార్‌లో అడ్రస్ మార్పు చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. తెల్ల రేషన్ కార్డు అందజేసి పెన్షన్లు మంజూరు చేయాలని తెలిపారు. దేశంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఏ పథకం అమలు కావాలన్నా ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రతి వార్డులో చెబుతున్నారన్నారు. మనందరి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేవలం అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అది కూడా పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని ఎక్కడికెళ్లినా ప్రజలే చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకుడు బత్తిన నవీన్‌కుమార్, దొడ్డి బాపూఆనంద్, ధనలక్ష్మి, భవాని, మొకర గోపి, పల్లా శ్రీనివాస్, గంటా శ్రీనివాస్, రాము మాస్టార్, బాబూరావు, నాగరాజు, వేణుగోపాల్, లక్ష్మణ్, జీతు, రాజేష్, రమణ తదితరులతో పాటు జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏఈ పార్వతి, టౌన్‌ప్లానింగ్, శానిటరీ, ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.


నేడు రాచపోలమాంబ పరస



అమ్మవారి తిరువీధి ఉత్సవంలో కలశాలతో కోలాటం సభ్యులు

అల్లిపురం: జీవీఎంసీ పరిధి 32వ వార్డులో వెలసిన శ్రీ రాచపోలమాంబ అమ్మవారి 19వ పరస గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు భీశెట్టి హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం అమ్మవారి తిరువీధి ఉత్సవంలో మహిళలు కలశాలతో పాల్గొన్నారు. తిరువీధి ఉత్సవంలో సిరి వినాయక సభ్యులు ప్రదర్శించిన కోలాటం చూపరులను ఆకట్టుకుంది. నేరెళ్లకోనేరు, ఏడుగుళ్ల స్లమ్, మార్కెట్‌రోడ్డు, బంగారమ్మమెట్ట, కర్ణాలవీధి, పీలావారివీధి, చలువతోట, అల్లిపురం మెయిన్ రోడ్డు, కుమ్మరివీధి, దేవాంగుల వీధి తదితర ప్రాంతాల్లో తిరువీధి అనంతరం మూలవిరాట్టుకు కలశాలతో తీసుకువచ్చిన పవిత్ర జలాలతో విశేషంగా అభిషేకించారు. గురువారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

29న భువనేశ్వరి అమ్మవారి అధివాసం



అల్లిపురం: ఓం భువనేశ్వరి సంస్థాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 29న సబ్బవరం మండలంలోని మణిపురంలో గల భువనేశ్వరీదేవి ఆరాధన పీఠంలో అమ్మవారికి వాకుడు (బజీభతి)పత్రితో ఆదివాసం నిర్ణయించినట్లు సంస్థాన్ ట్రస్ట్ నిర్వాహకులు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు అమ్మవారికి మంగళస్నానం, దివ్య పంచామృతాలు, పాలు తదితరాలతో శుద్ధి చేసి శాస్త్రోక్తంగా ఆదివాసం జరుపుతామని పేర్కొన్నారు. భక్తులు పూజలు చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందజేత



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ పూర్ణిమ శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఇటీవల కరెంట్ షాక్‌తో చనిపోయిన చైతన్య కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసింది. బుధవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమశ్రీధర్ బాధిత కుటుంబానికి చెక్కును అందించారు. గత ఏడాది జూలైలో నారాయణమూర్తి, నాగమణి దంపతుల కుమారుడు చైతన్య (9) రెండవ అంతస్తు బాల్కనీకి ఆనుకుని ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు చేతికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ కోడిగుడ్ల స్పందించారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారానికి వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించడంతో రూ.5 లక్షలు పరిహారం అందింది. ఈ మేరకు బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే, కార్పొరేటర్ చెక్కు అందించడంతో బాధితుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖాధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు బాధ్యతగా భావించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న రిటర్నింగ్ అధికారి, జెడ్సీ

కంచరపాలెం: యువత ఓటు హక్కు నమోదు బాధ్యతగా భావించాలని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యపద్మ పిలుపునిచ్చారు. బుధవారం జ్ఞానాపురం జోన్-5 కార్యాలయం ఆవరణలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 13వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో మాట్లాడారు. జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతిపౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఏఈఆర్) జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకున్ననాడే దేశ భవిష్యత్తును నిర్ణయించవచ్చు అన్నారు. అనంతరం ఇటీవల నమోదు చేసుకున్న ఓటర్లకు గుర్తింపు కార్డులను జెడ్సీ అందజేశారు. ముందుగా జోనల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ గురుమూర్తి, బీఎల్‌వోలు, ఎలక్షన్ సెల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

మహారాణిపేట : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతీ, యువకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా స్కిల్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్ డిపార్టుమెంట్ వారి ద్వారా వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా డీఆర్‌డీఏ-ఎస్ఈఈడీఏపీ ద్వారా సమగ్ర శిక్షణ ఇస్తూ ఉచిత భోజన, వసతి, యూనిఫారం సౌకర్యాలతో ఉద్యోగాలు కల్పించే లక్ష్యంగా అరకు యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ)లో శిక్షణ ఇస్తుంది. హౌస్ కీపింగ్ మేనేజర్, ఫుడ్ అవుట్ లెట్ మేనేజర్ కోర్సులు టీటీడీసీ పెందుర్తిలో రిటైల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా రిటైల్ క్యాషియర్, రిటైల్ సూపర్‌వైజర్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇవ్వనున్నామని డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ శోభారాణి తెలిపారు. వివరాలకు 8909345016, 8979648272లో సంప్రదించాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ విజేతలకు అభినందన



స్కేటింగ్‌లో బంగారు పతకాలు సాధించిన బాలికలను అభినందిస్తున్న సీతారాం

మద్దిలపాలెం: రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన పొందల సహిర, పి.సమీక్షలు బంగారు, రజత, పతకాలు సాధించారు. ఈ మేరకు విజేతలకు మద్దిలపాలెంలోని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయంలో బుధవారం సభ్యుడు గొండు సీతారాం శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 నుంచి సహిరా జిల్లా, జాతీయ స్థాయిలో పాల్గొన్ని ఇప్పటి వరకూ 61 బంగారు, రజిత, కాంస్య పతకాలను సాధించడం అభినందనీయన్నారు. పి.సమీక్ష కూడా 2016 నుంచి జిల్లా, జాతీయ స్థాయి పోటీలలో 57 పతకాలు సాధించిందన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. వీరికి శిక్షణ ఇస్తున్న ట్రైనర్లు శీలం లక్ష్మణ్, సిహెచ్.సింహాద్రిలను కూడా సీతారాం అభినందించారు.

బిల్లు లేని పాత మొబైల్ ఫోన్లు కొంటే శిక్షార్హులు



సమావేశంలో పాల్గొన్న సెకండ్ హ్యాండ్ మొబైల్ దుకాణాల యజమానులు

అల్లిపురం: బిల్లులు లేని సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొంటే శిక్షార్హులవుతారని నగర క్రైం డీసీపీ నాగన్న పాత మొబైల్ కొనుగోలు దుకాణదారులను హెచ్చరించారు. డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బుధవారం సాయంత్రం సెకండ్ హ్యాండ్ మొబైల్ దుకాణదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు ఎవరి దగ్గరికైనా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు అమ్మకానికి తీసుకువచ్చిన వారిపై అనుమానం ఉన్నట్లయితే తక్షణమే సంబంధిత పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. అలా కాని ఎడల దుకాణదారులే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. నగరంలో సుమారు వంద వరకు సెకండ్ హ్యాండ్ మొబైల్ షాపులు ఉన్నాయన్నారు. వారందరు పోలీసుల సూచనలను కచ్చితంగా పాటించాలన్నారు. నిందితులను పట్టుకోవడంలో పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ యర్రంనాయుడు, సీసీఎస్ సీఐ సత్యనారాయణ, రమేష్, టూటౌన్ క్రైం ఎస్ఐ కె.శ్రీనివాస్, సెకండ్ హ్యాండ్ మొబైల్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి

- లోక్ అదాలత్ కార్యదర్శి కేకేవీ బులికృష్ణ

విశాఖ లీగల్ : శరవేగంతో విస్తరిస్తున్న విశాఖలో కార్మిక రంగం అంతే వేగంగా పెరుగుతోందని విశాఖ జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బులికృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవనంలో నగరంలోని వివిధ షాపింగ్ మాల్స్‌లో పనిచేస్తున్న కార్మికులు, ఇతర విభాగాల సిబ్బందితో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విశాఖలో షాపింగ్ మాల్స్, మాల్స్, బహుళ జాతి సంస్థల మాల్స్ పెరుగుతున్నాయని చెప్పారు. వీటిల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రత్యేక చట్టాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఈ - శ్రమ్ అమలులో ఉందన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు ఈ - శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు లోక్ అదాలత్‌లో ప్రత్యేక విభాగం ఉందన్నారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ మోహన్ లక్ష్మి మాట్లాడుతూ ప్రతి కార్మికుని కుటుంబానికి భద్రత అవసరమన్నారు. నగరంలోని వివిధ మాల్స్‌లో పనిచేస్తున్న కార్మికులు తమ వివరాలను కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.